సమాచారం

2న ఉత్తర ద్వార దర్శనం

కుత్బుల్లాపూర్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 2వ తేదీన స్వామి వారి ఉత్తర ముఖ దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 5 గంటల నుంచి స్వామి వారి దర్శనముంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం

కుత్బుల్లాపూర్: అధికారులు విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకవైపు ప్రజలకు కరెంటు తీసివేసే విషయంలో (ఎల్సీ) ఒక విధంగా ప్రకటన చేసి సుమారు 2 గంటల తరువాత విద్యుత్ సరఫరా చేయడంపై పలు కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని రంగారెడ్డిబండ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి కనెక్షన్ ఇచ్చే క్రమంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటన జారీ చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను పునరుద్ధరించక పోవడంతో ఈ విషయమై స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే అది తమ పరిధి కాదని, వేరే సెక్షన్ వాళ్లు వచ్చి కనెక్షన్ ఇస్తున్నారని పేర్కొనడం గమనార్హం. సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇస్తున్న సమాచారం ఒక విధంగా, సరఫరా మరో విధంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

26 మందికి కరోనా పరీక్షలు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 26 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారు కోవిడ్ టెస్ట్‌లు చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం

జగద్గిరిగుట్ట: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో పర్యటించిన ఆయన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. అదేవిధంగా అంజయ్యనగర్‌లో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి బీపీ, డయాబెటీస్ తదితర సాధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం: ఎమ్మెల్యే రఘునందన్



వేతన ఒప్పందంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, యూనియన్ ప్రెసిడెంట్ రఘునంద్‌రావు

కుత్బుల్లాపూర్: కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంటీఆర్ పరిశ్రమ ప్రెసిడెంట్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ఎంటీఏఆర్ గ్రూప్స్ ఆఫ్ యూనిట్స్‌కు సంబంధించి 2022–25 సంవత్సరాలకు కార్మికుల నూతన వేతన ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమానికి రఘునందన్‌రావు హాజరై యాజమాన్యంతో వేతన ఒప్పందం కుదిర్చారు. ఒక్కో కార్మికుడికి రూ.11,060 వేతనంతో పాటు ఇతర అలవెన్స్‌ల కింద రూ.12,040 ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, అడ్వైజర్ రామలింగారెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ రామ్మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

దళిత వాడలో సివిల్ రైట్స్‌డే

కుత్బుల్లాపూర్: సూరారం గ్రామం దళితవాడలో శనివారం సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకాదేవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. దళితుల శ్మశాన వాటికలో కబ్జాలను అరికట్టాలని, దళిత బంధు పథకాన్ని ప్రతి ఒక్క దళిత కుటుంబానికి వర్తింపజేయాలని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయాలని కోరారు. గట్టు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుండిగల్ ఏఎస్‌ఐ కిష్టయ్య, జీహెచ్‌ఎంసీ సీఈఓ బాలరాజ్, వీవీఎంసీ కిషన్‌రావు, దళిత నాయకులు జేమ్స్, విజయభాస్కర్, సత్యనారాయణ, శివకుమార్, భిక్షపతి, యాదయ్య, బాలయ్య, లక్ష్మణ్, శంకర్, రాములు, ఆంజనేయులు, ఏడుకొండలు, సంతోష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులు పూర్తయితే..

ముంపు సమస్యలు తొలగుతాయి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకాంద్



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కంగోల బాలబ్రహ్మచారి తదితరులు

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ పరిధిలోని నాలా పనులు పూర్తయితే వర్షాకాలంలో ముంపు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకాంద్ అన్నారు. అదేవిధంగా వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తయితే వేసవిలో నీటి ఎద్దడి తగ్గుముఖం పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాటర్ వర్క్స్, ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న వాటర్ స్టోరేజ్ ట్యాంక్, వర్షపు నీటి నాలాల అభివృద్ధి పనులపై శనివారం మేయర్ కొలన్ నీలారెడ్డి, కమిషనర్ వంశీకృష్ణలతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. సింహపురి కాలనీలో రూ.1.8 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 1 మిలియన్ లీటర్ల వాటర్ స్టోరేజ్ ట్యాంక్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వద్ద రూ.10 కోట్లతో నిర్మిస్తున్న 6 మిలియన్ లీటర్ల వాటర్ స్టోరేజ్ ట్యాంక్‌లతో పాటు ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో రూ.3.17 కోట్లతో భవ్యాస్ ఆనందం నుంచి వర్టెక్స్ విల్లాస్ వరకు, నిజాంపేట్ మెయిన్ రోడ్డులోని ఆచార్య కుంట నుంచి బాటా జంక్షన్ వరకు రూ.6 కోట్లతో చేపడుతున్న నాలా నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ట్యాంక్, నాలా పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగం పెంచి రెండు నెలల్లో పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన కాలనీల్లో మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని తన కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర కేలండర్, జగద్గిరిగుట్ట విశ్వబ్రాహ్మణ యువజన సంఘం కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కుత్బుల్లాపూర్ మండలాధ్యక్షుడు కంగోజు బాలబ్రహ్మాచారి, ప్రధానకార్యదర్శి కమ్మరి రాజుచారి, కోశాధికారి పోలోజు రవీంద్రచారి, సహాయకశాధికారి మధుచారి, యూత్ అధ్యక్షులు ఎంవీ రాజ్‌కుమార్‌చారి, మండల ఉపాధ్యక్షులు కొత్తపల్లి కృష్ణాచారి, ఎంవీ ప్రవీణ్‌చారి, జయంచారి, ప్రభుచారి, రామ్మూర్తిచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లోజు కిషోర్‌చారి, శేషాచారి, కరుణాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరీ ఆలయంలో...

జగద్గిరిగుట్టలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకాంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్ గుప్తా, ప్రకాష్ గుప్తా, తెనాలి శ్రీనివాస్‌గుప్తా, నేతి శంకర్ గుప్తా, సత్యనారాయణ గుప్తా, కైలాశం గుప్తా, గంజి స్వామి తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలి



అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో...



దూలపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తూ..

రంగారెడ్డినగర్: హిందూ దేవతల పట్ల అసభ్యకరంగా మాట్లాడి అయ్యప్ప స్వామిని దూషించిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని రంగారెడ్డినగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. నాస్తికత ముసుగులో హిందూ మతాన్ని, దేవుళ్లను దూషించడం ఫ్యాషన్‌గా మారిపోయిందని, దేవుళ్లను దూషించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో అయ్యప్ప మాలధారులు రవీందర్‌రెడ్డి, పృథ్వీ రాజు, సందీప్ పాటిల్, శ్రీశైలం, సువ్వారి శ్రీనివాస్, గరిగే సత్యనారాయణ, పరుష వేణు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దూలపల్లి గ్రామంలో...

అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కొంపల్లి మున్సిపల్ పరిధి దూలపల్లి గ్రామంలో భక్తులు రాజకీయాలకు అతీతంగా ర్యాలీ నిర్వహించారు. హిందూ దేవుళ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడినా అతన్ని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు.

'కేసీఆర్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి'



బీజేపీ జెండాను ఎగురవేసిన కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో కేసీఆర్ దుర్మార్గపు పాలనకు రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ తెలుగుతల్లి నగర్‌లో బీజేపీ నాయకుడు వావిలాల చక్రపాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను శనివారం శ్రీశైలంగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం ప్రజాధనాన్ని అభివృద్ధి పనుల కమిషన్ల పేరుతో దోచుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి విజేందర్‌రెడ్డి, నాయకులు అంగడి మల్లేష్, గుబ్బల లక్ష్మీనారాయణ, దేవర రమేష్, విఘ్నేష్, మారె గణేష్, శ్రీనివాస్‌గౌడ్, కుమార స్వామి, నాగరాజు, క్రాంతి, పృథ్వీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ సంజీవ్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: డివిజన్ సాయిబాబానగర్‌లోని గాజులరామారం సర్వే నంబర్.49లో దిల్ సంస్థ కేటాయించిన స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ సంజీవరావును కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఆర్డీఓ మల్లయ్య నేతృత్వంలో పదుల సంఖ్యలో నిర్మాణాలు కూల్చిశారని, అదే ప్రాంతాల్లో మరలా నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సంజీవ్‌రావు జనవరి 5న అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అంగడి మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మారి గణేష్, బీజేవైఎం జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ నాగరాజు, 129 డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు పృథ్వీగౌడ్, 130 డివిజన్ ప్రధాన కార్యదర్శి విజేందర్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోల్కం విగ్నేష్‌ముదిరాజు, కార్యదర్శి గంధం కుమారస్వామి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేస్తాం



లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్లను అందజేస్తామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఆసరా పింఛన్‌దారులకు ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయ ని నాలుగు నెలలకు సంబంధించిన పింఛన్లు నిలిపివేశారు. దీంతో బాధితులు ఈ విషయమై ఫిర్యాదు చేయగా మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి వారికి ఫోర్ వీలర్ వాహనాలు లేవని నిర్ధారించి 19 మందికి పింఛన్లను పునరుద్ధరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ శ్రీశైలంయాదవ్ 4 మాసాలకు సంబంధించిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మెప్మా కోఆర్డినేటర్ పద్మావతి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ఘటనల్లో..
చోరీకి పాల్పడ్డ నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ క్రైమ్స్ జి.నర్సింహారెడ్డి



స్వాధీనం చేసుకున్న నగలు, నగదు, సెల్‌ఫోన్లు

కుత్బుల్లాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను బాలానగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.24,64,340 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ క్రైమ్స్ జి.నరసింహారెడ్డి వివరాలు వెల్లడించారు.

9.3 తులాల బంగారు ఆభరణాలు..

మేడ్చల్‌కు చెందిన ఆంథోనీరెడ్డి కుటుంబం 2022 జూన్ 2వ తేదీ రాత్రి 9 గంటలకు తమ బంధువు ఇంట్లో పెళ్లికి వెళ్లారు. జూన్ 3వ తేదీ ఉదయం 4.50 గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 9.5 తులాల బంగారు ఆభరణాలు, కొద్ది మొత్తంలో నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కర్నాటక రాష్ట్రం, గుల్బర్గ జిల్లా శాఖాపురికి చెందిన లారీ డ్రైవర్ రాజు కాలే(39) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ పోలీసుల సహకారంతో బాలానగర్ సీసీఎస్ పోలీసులు రాజును అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి 9.3 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. కాగా రాజు గతంలో గుల్బర్గలో 7 ఇళ్ల దొంగతనాలు, మునగాల పీఎస్ పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

33.62 తులాల బంగారు ఆభరణాలను...

సనత్‌నగర్‌కు చెందిన జగిని మహేష్ దంపతులు బీరువాలో ఉంచిన 33.62 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని డిసెంబరు 16న సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా కేపీహెచ్‌బీ కాలనీ గోకుల్‌ప్లాట్స్‌లో నివాసముండే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగి బాదమ్ బాలకృష్ణ(32) దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో జగిని మహేష్ ఫ్లాట్ ఎదురుగా అద్దెకు ఉన్న సమయంలో నకిలీ డోర్ కీ తయారు చేయించి దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. అతడి నుంచి 33.62 తులాల బంగారు ఆభరణాలను స్వీధీనం చేసుకున్నారు.

రూ.4 లక్షల నగదు...

చింతల్‌లో ల్యాబ్ నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ డిసెంబరు 26న రాత్రి 9.30 గంటల సమయంలో తన కార్యాలయ లాకర్‌లో రూ.4 లక్షల నగదు భద్రపరిచాడు. 27వ తేదీన కార్యాలయానికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు అల్మారా పగులగొట్టి అందులో ఉన్న నగదు చోరీ చేసినట్లు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా చింతల్ మాణిక్యనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి నొట్టి గణపతిరావు(28), ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే తోలాబ్ సోమేష్(26)లు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3,14,340 నగదుతో పాటు యమహా ఎఫ్‌జెడ్ వాహనాన్ని సీజ్ చేశారు. కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.బాలరాజు, ఎస్ఐలు భానుప్రసాద్, పోచయ్య, మల్సూర్, నర్సింహా, కానిస్టేబుళ్లు అమరేందర్, మహిపాల్, వెంకటనాగరాజు, ఎలీజర్, అగ్గర్ పాషా, పూర్ణచందర్‌రావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణప్రసాద్, రామకృష్ణ, సనత్‌నగర్ ఎస్ఐ రాజు, జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులులను ప్రశంసించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన తీగల మహేష్(28), సింధులకు సంవత్సరం క్రితం వివాహమైంది. కాగా మహేష్ పనిపాట లేకుండా ఉండటంతో భార్యాభర్తల మధ్య గొడవలతో ఇటీవల సింధు పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 29న తన అక్క మీనాకు ఫోన్ చేసిన మహేష్ జీవితంపై విరక్తి కలిగిందని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో వెంటనే ఆమె ఈ విషయాన్ని తన తల్లి శోభకు చెప్పింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మహేశ్ మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ రావడంతో 30వ తేదీన దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో దుండిగల్ పెద్ద చెరువు వద్ద మహేష్ బైక్, బట్టలు, చెప్పులను పోలీసులు గుర్తించగా శనివారం అతడి మృతదేహం చెరువులో పైకి తేలింది. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.